
# ధర్మప్రభువు

బి.వి.యస్. లక్ష్మి



'అంతా కాంతదాసులే' అన్న త్యాగరాజు నానుడి కాంతారావుపట్ల పూర్తినిజం కాకపో యినా 'కొంత' నిజం. ఎలా చెప్మా అంటారా? పన్నెండు గంటలు ప్రైవేట్ కొలువులో వెట్టి చాకిరీ చేసి, 'యిస్సు'మనుకుంటూ వచ్చిన పెద్ద మనిషి ఇంట్లో అడుగుపెట్టగానే భార్య 'రైట్... ఎబౌట్ టర్న్ అండ్ మార్చ్ టు థియేటర్' అంటే 'యస్సు' అంటాడా చెప్పండి. మొదట ఇప్పుడు 'తడి' లేదన్నప్పటికీ శ్రీమతి 'ఇంకా సునకి పిల్లా పాపల్లేరు. ఆ తర్వాత ఎట్లాగూ సిన్మాలు, షికార్లు కుదరదు. మై క్యా కరూ రామ్ ముఝే బుడ్డా మిల్‌గయా?' అనేసరికి మెత్తబడ్డాడు.

'వచ్చాకే ఆహారం... అందాకా ఉపాహారం లాగించండి. నేను చీరమార్చుకొస్తాను. నాకు ట్రయల్‌పార్ట్ నుంచీ చూడకపోతే సిన్మా చూసిన ట్లుండదు. మీరు టక్‌చేసి, టైకట్టుకుని బండిని పిలవండి' భర్తకు పురమాయించి తను బాత్రూ మ్ తలుపు వేసుకుంది ఉష.

*　*　*

'ఏయ్ రిక్షా ఇలారా' పిల్చాడు కాంతారావ్.

'ఏయ్ గీయ్ అనవాకండి. నేనేమీ మీ బామ్మర్దిని కాను'.

'సర్లేవోయ్... ఊర్వశి థియేటర్‌కొస్తావా?'

'ఎంతమంది?'

'ఎదురుగా ఇద్దరం కన్పట్టల్లా?'

'పన్నెండు రూపాయలు ఇప్పించండి'

'నేనెట్లాగూ పది అంటానని నువ్వు పెచ్చు చెప్తున్నావా? మీరు బాగా తెలివి మీరారోయ్'.

'అన్నీమండిపోతూంటే ఏం చేస్తాం చెప్పం డి. ఏదోరకంగా 'బండి' లాగాలి కదా'.

'మీకేం నాయనా... అన్ని సదుపాయాలూ మీకే వున్నై. రెండ్రూపాయలకు బియ్యం, ఇంది రమ్మ ఇల్లు, ఉచితవిద్య, పింఛన్ వగైరా వగైరా. మా బోటి మధ్యతరగతి వాళ్ల పని త్రిశంకు స్వర్గంలా వుంది. అపాపు... మాటల్లోపడి థియే టర్ దాటి వచ్చాం'.

బండికి డబ్బులిచ్చేసి హాల్లోకి 'ఎంటర్' అయ్యారు. థియేటర్‌లో 'ఎంటర్ ది డ్రాగన్' ఆడుతోంది. జెంట్స్ వైపు ఎక్కువున్నారు.

'లేడీస్ క్యూలో రెండుటిక్కెట్లు తీసుకో డియర్. నేను తీసుకోవాలంటే చాలా డేర్ చెయ్యాలి' అన్నాడు కాంతారావు భార్యతో.

'ఏమో బాబూ... మీరే తీసుకోండి. నాది పట్టుచీర. నలిగితే మళ్లీ డ్రైక్లీనింగ్‌కి యివ్వాలి. రేపు మా పిన్ని కూతురు పెళ్లికి కూడా యిదే చీర' ముక్తాయించింది ఉష.

'తప్పించుకు తిరుగునది ధన్యురాలు సుమ తీ' అనుకుంటూ క్యూ అనే పద్మవ్యూహంలో చొరబడ్డాడు కాంతారావ్. క్యూ నత్తనడక నడు స్తోంది. మధ్యలో దూరేది కొందరు. కాంతా రావు దృష్టి కౌంటర్ కిటికీ మీద పడ్డది. 20 రూపాయలు అని వున్నచోట చెరిపి చాక్‌పీసుతో 21 అని రాసివుంది. ముందతని భుజంతట్టి రేట్లు ఎప్పట్నించి పెంచారు గురూ అన్నాడు.

'ముందతను వెనక్కి తిరిగి 'ఏసీ పెట్టినప్ప ట్నించి శిష్యా' అన్నాడు తన విట్టుకు తనే నవ్వు కుంటూ. కొద్ది దూరంలో నిలబడ్డ భార్యకు సైగచేసి 'హలా. నువ్వేమైనా డబ్బులు తెచ్చావా? రెండ్రూపాయలు షార్టు అన్నాడు కాంతారావు. 'మీరెప్పుడైనా ప్యాకెట్ మనీ యిస్తేనే కదా నా దగ్గర పర్స్ ఉండటానికి. ఇంట్లోకి కావల్సిన వన్నీ మల్లెపూలతో సహా నేను తెచ్చిపడేస్తుంటే నీకు డబ్బులతో ఏం పని అంటారాయె...' అంది ఉష దెప్పిపొడుపుకి యిదే ఛాన్సు అని.

కాంతారావు అసలే యమ టెన్షన్‌లోవుంటే

బిచ్చగత్తె ఒకామె జిడ్డులా పట్టుకుంది. 'అయ్యా గుడ్డిదాన్ని బాబు. ధర్మం చెయ్యండి. మీ పిల్లా పాపా చల్లగుండాలి'. కాంతారావులో కరుణ రసం పొంగింది. 'ఇంద ముసలమ్మా... ఏమిటో ఈ వయసులో నీకీ కష్టం. జాలేస్తోంది. ఏం పాపం చేశావని నీకీ రాత. దేవుడు నిజంగా నిర్దయుడు' సానుభూతి తెలుపుతూ పర్సుతీసి సత్తుపళ్లెంలో ఒక నాణెం వేశాడు. టంగ్‌మని చప్పుడైంది. ముసల్ది సంతోషించింది.

"మారాజు వెయ్యేళ్లు బతకాల. మీవంటి ధర్మపెబువులుండబట్టే వానలు కురిసి పంటలు పండుతున్నయ్. తింటానికి బువ్వ దొరుకుతున్నది" కృతజ్ఞత తెలిపింది.

తమ నెంబర్ల సీట్లల్లో ఆశీనులైన తర్వాత 'ఆర్యూ హ్యాపీ నౌ' అనడిగాడు కాంతారావు.

'య్యె' అని టక్కున సమాధానం ఇచ్చింది ఉష.

* * *

హాలులో జనం నిండేదాకా పాటలు వేస్తున్నారు థియేటర్‌వాళ్లు.

'ఖుషీ ఖుషీగా నవ్వుతూ...

చలాకిమాటలు రువ్వుతూ...

హుషారు గొలిపేవెందుకే

నిషాకనులదానా...'

పానకంలో పుడకలా 'సోడా, సోడా - ఆంధ్రా సోడా' అంటూ ఆడిటోరియంలోకి ఓ కుర్రాడొచ్చాడు.

'బోయ్' అని పిల్చాడు కాంతారావు.

'ఓయ్' అని పలికాడు కుర్రాడు.

'ఉషా... నిషాకనులదానా... యువాంట్ సోడా?' అడిగాడు కాంతారావు.

## రచయిత(త్రు)లకు గమనిక

'కథాకేళి'లో ప్రచురించే కథలతో పాటు క్లుప్తంగా రచయితల పరిచయం కూడా ఇవ్వాలని నిర్ణయించాం. ప్రచురణ కోసం ఎంపికై మావద్ద సిద్ధంగా ఉన్న కథల రచయితలు తమ ఫొటో, పరిచయం (ప్రింట్‌లో 10 లైన్లకు మించకుండా) తెలుగులో వ్రాసి పంపించ వలసిందిగా కోరుచున్నాం.

– ఎడిటర్

'విటమిన్ ఎమ్ లేకపోయినా పోదురూ బడాయీ' అంది ఉష.

'కావాలా అనడిగినా లడాయేనా'

'బేడ' (వద్దు)... అంది ఉష తనకున్న కొద్ది పాటి కన్నడ పరిజ్ఞానంతో.

అణాలు, బేడలు ఎప్పుడోపోయినయ్' అన్నాడు కాంతారావు ఛలోక్తిగా.

* * *

కొద్దిసేపయ్యాక గుడ్డిది పళ్లెం తడుముకుంటే అప్పటికిగానీ అర్థం కాలేదు సదరు ధర్మపెబువు పళ్లెంలో అదివరకే వున్న రెండ్రూపాయల బిళ్ల తీసుకొని, పావలా బిళ్ల వేసినట్లు.

* * *

మర్నాడు బ్రేక్‌ఫాస్ట్ సమయంలో 'ప్రభుత్వానికి బెగ్గింగ్ బ్యాన్ చేసే యోచన వుందటండీ' అంది ఉష న్యూస్‌పేపర్ తిరగేస్తూ.

'ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చెయ్యకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటే అదే జీవనోపాధిగా కాలం వెళ్లబుచ్చుతున్న వాళ్లు 'నష్టపోరూ... పిచ్చితుగ్లక్ పరిపాలన కాకపోతే...' ముక్తాయించాడు కాంతారావు, బియ్యే (చరిత్ర).